సాక్షి
మెదక్
ఆదివారం । 23 । జూన్ । 2024



జల్సాల కోసం చోరీలు

జల్సాలకు అలవాటు పడి సెంట్రింగ్ బాక్స్‌ల చోరీకి పాల్పడుతున్న గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వివరాలు 8లో ▸



రైతులను ఇబ్బంది పెట్టొద్దు

అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని రామాయంపేట మండల సమావేశంలో సభ్యులు వాపోయారు.


వివరాలు 9లో ▸

నేడు విద్యుత్ బంద్

పాపన్నపేట(మెదక్): మండలంలోని పాపన్నపేటలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నర్సింలు తెలిపారు. చెట్ల కొమ్మలు నరికే కార్యక్రమం ఉన్నందున విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

భద్రత లేని బతుకుబండి..!

ఆర్టీసీలో పనిభారం.. కార్మికుల కకావికలం




సండే స్పెషల్

'ఆర్టీసీ బస్సులో ప్రయాణిద్దాం.. సురక్షితంగా గమ్యానికి చేరుదాం'. ఇది ఆర్టీసీ నినాదం. అయితే.. దీని వెనుక సంస్థ కోసం చెమట చుక్కలు చిందించే కార్మికుల కృషి ఎంతో ఉంటుంది. కానీ.. వారి బతుకు చక్రం మాత్రం సురక్షితంగా లేదు. చాలీచాలని జీతాలు, అధికారుల వేధింపులు, డొక్కుబస్సులు, డబుల్ డ్యూటీలు, పనిఒత్తిడి, అదనపు పనిభారం, విశ్రాంతి దొరక్క రోగాలబారిన పడటం ఇలా.. అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. తమ బాధలు చెప్పుకోలేని దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఎవరైనా అడగటానికి సాహసం చేస్తే టార్గెట్ చేస్తున్నారు. అధికారుల వేధింపులు భరించలేక మెదక్ డిపోలో డ్రైవర్లు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడం చూస్తుంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నిత్యం ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చుతున్న కార్మికులు.. తమ బతుకు బండిని మాత్రం సరిగా లాగలేక పోతున్నారు. ఆర్టీసీ కార్మికుల దుర్భర పరిస్థితులపై ఈ వారం ప్రత్యేక కథనం.

- గజవెల్లి షణ్ముఖ రాజు, సాక్షి సిద్దిపేట/ జక్కుల శ్రీకాంత్, సిద్దిపేట కమాన్

- రోజుకు 400 నుంచి 420 కిలోమీటర్లు డ్యూటీ
- 2 నుంచి 4 గంటలు అదనపు పనిభారం
- సెలవు కావాలంటే డబుల్ డ్యూటీ చేయాల్సిందే..
- చనిపోయారని లీవడిగితే శవంతో సెల్ఫీ పంపాలట..
- కేఎంపీఎల్ రాకపోతే డ్రైవర్లకు కౌన్సెలింగ్
- 'ఉచిత హామీ'తో పెరిగిన ప్రయాణికులు..
- కండక్టర్, డ్రైవర్లకు చుక్కలు
- టార్గెట్ కోసం అధికారుల వేధింపులు
- విశ్రాంతి లేక రోగాల బారిన పడుతున్న కార్మికులు
- ఇది ఆర్టీసీ కార్మికుల దయనీయ పరిస్థితి



తగ్గేదే లేదు

డ్రైవర్ల ప్రకటన

8లో..

నేనెందుకు సమాచారం ఇవ్వాలి
- ఆర్ఎం

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ఆర్ఎం ప్రభులతకు వివరణ కోరగా, నేనెందుకు సమాచారం ఇవ్వాలి. నేను చెప్పను. అని ఫోన్ కట్ చేశారు. అనంతరం మళ్లీ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు కొత్త షెడ్యూల్ ప్రకారం బస్సులు నడపాల్సిందేనని స్పష్టం చేశారు. 8లో



మెదక్ డిపో ఎదుట ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

రెండో రోజుకు చేరిన మెదక్ డ్రైవర్ల సమ్మె

మెదక్‌జోన్: మెదక్ డిపోలో ఆర్టీసీ కార్మికుల సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. అధికారుల వేధింపులకు నిరసనగా శుక్రవారం 60 మంది డ్రైవర్లు బస్సులను నిలిపివేసి ఆందోళనబాట పట్టిన విషయం తెలిసిందే. డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం హుటాహుటిన డ్రైవర్లతో జరిపిన చర్చలు ఫలించలేదు. శనివారం కూడా డ్రైవర్లు విధుల్లోకి చేరలేదు. డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా మెదక్ డిపో మేనేజర్ సుధా సిద్దిపేట, నారాయణఖేడ్, ప్రజ్ఞాపూర్, సంగారెడ్డి, దుబ్బాక, జహీరాబాద్ డిపోల నుంచి 25 బస్సులను తెప్పించి నడిపిస్తున్నారు. కాగా, తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆర్టీసీ డ్రైవర్లు స్పష్టం చేశారు. డీఎం సుధ, సీఐ వీరబాబుల వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు.

న్యూస్‌రీల్

సమయపాలన పాటించాలి: జెడ్పీ సీఈఓ

అల్లాదుర్గం(మెదక్): సమయపాలనతో విధులు నిర్వర్తించి ప్రజలకు మంచి పాలన అందించాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అధికారులకు సూచించారు. శనివారం అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజాపాలనతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో అధికారులు పాలనపై దృష్టి పెట్టాలన్నారు. మిషన్ భగీరథ పథకం అమలు తీరుపై గ్రామాల్లో సర్వే చేపడుతున్నట్లు వివరించారు. అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు ఎంపీడీఓ శంకర్ ఉన్నారు.

నిధులు మంజూరు చేయండి



మంత్రి కొండా సురేఖతో మాట్లాడుతున్న నాయకులు

నర్సాపూర్: నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను కోరినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో పలువురు నాయకులతో కలిసి మంత్రిని కలిసినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించడంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, హత్నూర జెడ్పీటీసీ ఆంజనేయులు, ప్యాక్స్ చైర్మన్ దుర్గారెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

'నీట్' నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మెదక్ కలెక్టరేట్: నీట్ పశ్నపత్రం లీకేజీ నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే పేపర్ లీకేజీలు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ టౌన్ బాధ్యులు కార్తీక్, శివ, కార్తీక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బేఫికర్

'ఫసల్' ప్రీమియం బాధ్యత ప్రభుత్వానిదే

- గ్రామం యూనిట్‌గా వరి, మొక్కజొన్నకు వర్తింపు
- మండలం యూనిట్‌గా పత్తి
- రైతుల అభిప్రాయాలు తీసుకున్న కలెక్టర్లు
- త్వరలోనే మార్గదర్శకాల విడుదల

'ఫసల్ బీమా' అమలు కాబోతోంది. ఎన్నో మార్పులు, చేర్పులతో పకడ్బందీ అమలుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక సమావేశాలను నిర్వహించి, రైతులు అభిప్రాయాలను కూడా తీసుకుంది. ఇందులో భాగంగానే ఉమ్మడి మెదక్ జిల్లాలోనూ గత నెల 23న సమావేశం జరిగింది. గతంలో మాదిరిగా కాకుండా ప్రీమియం భారం పూర్తిగా సర్కారే భరించనుంది. ఇంకా ఎన్నో కొత్త అంశాలను చేర్చబోతోంది. ఆ మేరకు త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనుంది.



గజ్వేల్: ఉమ్మడి మెదక్ జిల్లా (సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్)లో వానాకాలానికి సంబంధించి సుమారుగా 14 లక్షల ఎకరాలకుపైగా వివిధ రకాల పంటలు సాగులోకి వస్తుంటాయి. ఇందులో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ప్రధానం. మిగిలిన విస్తీర్ణంలో ఇతర పంటలు సాగులోకి వస్తాయి. యాసంగి సీజన్‌కు సంబంధించి మరో 8 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వస్తుంటాయి.

గతంలో ఇలా...

ఫసల్ బీమా పథకంలో వానాకాలంలో సాగు చేసే ఆహార, నూనె గింజలు, వాణిజ్య, ఉద్యాన పంటలకు పంటల వారీగా, ప్రాంతాల వారీగా ప్రీమియాన్ని నిర్దేశించారు. అగ్నిప్రమాదం, పిడుగుపాటు, గాలివాన, వడగళ్లు, తుపాను, టోర్నడో, అనావృష్టి, వరదలు, నీట మునిగిపోవడం, తెగుళ్లు, ప్రతికూల వాతావరణం వల్ల దిగుబడులకు నష్టం వాటిల్లితే నష్ట పరిహారం చెల్లించేవారు. అంతేగాకుండా ప్రతికూల వాతావరణం కారణంగా రైతులు విత్తనాలు విత్తకపోవడం, నార్లు వేయకపోవడం వల్ల కలిగే ఆర్థిక నష్టాలకు బీమా మొత్తంలో 25 శాతం వరకు సత్వర నష్టపరిహారం అందించే అవకాశం ఈ పథకంలో ఉండేది.

➡ పంట మధ్యకాలంలో నష్టపోయిన రైతులకు సైతం నష్టాన్ని అంచనా వేసి పరిహారంలో 25 శాతం చెల్లించే అవకాశముండేది. అలాగే పంట కోతల తర్వాత పొలంలో ఆరబెట్టిన పంటకు 14 రోజుల్లోపు తుపాను, అకాల వర్షాల కారణంగా నష్టం జరిగితే నష్టాన్ని అంచనా వేసి షరతులతో కూడిన చెల్లింపులు జరిపేవారు.

➡ ఇందులో భాగంగానే ప్రభుత్వం మొక్కజొన్న ఎకరాకు రూ. 25వేల బీమా సౌకర్యాన్ని కల్పించారు. ఇందులో 2 శాతం అంటే రూ. 500 ప్రీమియంగా రైతు చెల్లించాల్సివచ్చేది. వరి ఎకరాకు రూ. 34 వేల బీమా వర్తింపునకు గాను 2 శాతం అంటే రూ. 680 ప్రీమియం, కంది ఎకరాకు రూ. 14 వేల బీమా వర్తించే అవకాశముండగా ఇందులో 2 శాతం.. రూ. 280, పత్తికి ఎకరాకు రూ. 1,750 ప్రీమియం చెల్లించాల్సి వచ్చేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా ఈ పథకం అమలయ్యేది. కానీ వివిధ కారణాలతో ఐదేళ్లుగా ఈ పథకం నిలిచిపోయింది.

భారం ఉండబోదు

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ పథకాన్ని పునరుద్ధరించడానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. రైతులపై నయాపైసా భారం లేకుండా అమలు చేయడానికి సంకల్పించింది. గతంలో ప్రీమియం భారం వల్ల ఈ పథకంలో చేరే వారు కాదు. నేడు అలా కాకుండా ప్రతి రైతుకు 'ఫసల్ బీమా'ను వర్తింపజేయడానికి నిర్ణయించింది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాల వారీగా కలెక్టర్లు ప్రత్యేక సమావేశాలను నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించి పంపారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన సమావేశం సంగారెడ్డి కలెక్టరేట్‌లో మే 23న జరిగింది. కొత్తగా అమలు చేయబోతున్న పథకంలో గతంలో ఉన్న మొక్కజొన్న పంటతో పాటు వరిని కూడా గ్రామం యూనిట్‌గా తీసుకొని బీమా వర్తింపజేయనుంది. పత్తిని మండలం యూనిట్‌గా తీసుకోనుంది. గతంలో ఉన్న బీమా చెల్లింపులకు ఇంకా మెరుగైన పద్ధతిని అమలు చేయనుంది. ఇందుకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు వచ్చే అవకాశముంది. ఈ అంశంపై సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి మహేశ్ మాట్లాడుతూ ఫసల్ బీమా పథకానికి మెరుగైన పద్ధతిలో అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలోనే రానున్నాయన్నారు.



సిద్దిపేట జిల్లాలో పత్తి సాగు

రెండు రోజుల్లో సర్వే పూర్తి కావాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్



గూగుల్‌మీట్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: మిషన్ భగీరథ ఇంటింటి సర్వేలో వేగం పెంచి రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి సర్వే నిర్వహణ తీరును సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాల వారీగా అత్యంత పారదర్శకంగా సర్వే నిర్వహించాలని సూచించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాగునీటి సరఫరా లేని ఆవాసాలు, ప్రాంతాలు, ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి పరిష్కరించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలో నిర్దేశిత గడువులోగా పూర్తి చేసే దిశగా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీడీఓలు, ఎంపీఓలు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణ వద్దు



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ కార్యదర్శి బస్వరాజు, ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ 3వసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. పర్మనెంట్ కార్మికులు, ప్రభుత్వ, ప్రజా సంపదను కాపాడాల్సిన ప్రభుత్వమే ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. కార్పొరేట్ వ్యక్తుల ఆస్తులను పెంచడం కోసం కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని మండిపడ్డారు. గనుల తవ్వకాలను ప్రైవేటుకు అప్పగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, బాలమణి, కోశాధికారి నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ టౌన్, రూరల్ సీఐలు బదిలీ



మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణ, రూరల్ సీఐలు దిలీప్‌కుమార్, కేశవులును ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ మల్టీజోన్ ఐజీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్‌లో ఇటీవల జరిగిన ఇరువర్గాల ఘర్షణ తర్వాత ఒకేసారి ఇద్దరు సీఐలను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేయడంపై విధుల్లో నిర్లక్ష్యమే కారణం అయి ఉండొచ్చనే ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా నిజామాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న రాజశేఖర్‌రెడ్డిని మెదక్ రూరల్ సీఐగా నియమించారు. మెదక్‌టౌన్ బాధ్యతలు ఇంకా ఎవరికి అప్పగించలేదు.

మా భూములు ఇచ్చేది లేదు



ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నర్సాపూర్: సంగారెడ్డి కాలువకు తమ భూములు ఇవ్వలేమని మండలంలోని చిన్నచింతకుంట రైతులు ఖరాకండిగా చెప్పారు. శనివారం రైతు వేదికలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తమ గ్రామాల మీదుగా కాలువ నిర్మాణాన్ని రద్దు చేయాలని కోరుతూ రైతులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు కాలువకు సేకరించే భూములకు పరిహారం అందజేస్తామని చెప్పారు. భూముల్లో బోర్లు, చెట్లు ఇతర ఏమైనా ఉంటే అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. అయితే భూమికి భూమి ఇవ్వాలని, మార్కెట్ రేటు ప్రకారం తమ భూములకు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తమకు ఓపెన్ కాలువ వద్దని మండలంలోని నంద్యాతండా, రంజా తండాలకు చెందిన రైతులు ఆర్డీఓకు చెప్పారు. ఇప్పటికే కాళేశ్వరం కాలువ, కరెంట్ లైన్‌కు భూములు పోయాయని, మళ్లీ సంగారెడ్డి కాలువ కోసం భూములు ఇవ్వలేమన్నారు. కావాలంటే పైపులైన్ ద్వారా కాలువ నిర్మించాలని కోరారు. అనంతరం జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. డిమాండ్లను ఉన్నతాధికారులకు వివరిస్తానని ఆర్డీఓ నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

చేప పిల్లలు వచ్చేనా..?

- ఇప్పటివరకు జాడలేని టెండర్లు
- ఆందోళనలో మత్స్యకారులు
- గతేడాది 1,411 చెరువుల్లో చేప పిల్లల పంపిణీ



మెదక్‌జోన్: ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. ఏటా ఏప్రిల్, మే నెలలోనే టెండర్లు నిర్వహించేవారు. వర్షాలు సమృద్ధిగా కురవగానే ఆగస్టు, సెప్టెంబర్‌లో చెరువుల్లో చేపపిల్లలు వదిలేవారు. కానీ ఈఏడాది ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 302 మత్స్యకార సంఘాలు

మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాటును ఇచ్చేందుకు గత ప్రభుత్వం 2017లో ఉచిత చేపపిల్లల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టింది. గతేడాది జిల్లాలోని 1,411 చెరువుల్లో సుమారు రూ.5 కోట్ల విలువ చేసే చేప పిల్లలను పంపిణీ చేసింది. ప్రస్తుతం అవి 1 నుంచి 2 కిలోల బరువు కావడంతో వాటిని పట్టుకుని మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం గురించి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఈ పథకం ఉంటుందా..? లేదా అని మత్స్యకారులు సందిగ్ధంలో పడ్డారు. జిల్లావ్యాప్తంగా 302 మత్స్యకార సంఘాలు ఉండగా వాటిలో 16,800 మంది సభ్యులుగా ఉన్నారు. వీరంతా మత్స్య సంపదపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కాగా ఈ ఏడాది ఇప్పటివరకు చేప పిల్లలకు సంబంధించి ఎలాంటి టెండర్ పక్రియ చేపట్టకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ పథకాన్ని నిలిపివేస్తే మా బతుకులు ప్రశ్నార్థకంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై జిల్లా మత్స్యశాఖ అధికారి నర్సింహారావును వివరణ కోరగా ఉచిత చేప పిల్లల పథకానికి సంబంధించి ఇప్పటివరకు తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం రాలేదని తెలిపారు. గతేడాది మేలోనే టెండర్ ప్రక్రియ నిర్వహిస్తే ఏపీకి చెందిన ముగ్గురు టెండర్‌లో పాల్గొన్నారని చెప్పారు.

క్లుప్తంగా

జాతీయస్థాయికి 'డెస్క్ లిఫ్టర్' ప్రాజెక్ట్ ఎంపిక

రూపకల్పనలో కన్‌సాన్‌పల్లి విద్యార్థి ప్రతిభ


ప్రాజెక్ట్‌తో స్రవంతి, గైడ్ టీచర్ సిద్దేశ్వర్

వట్‌పల్లి(అందోల్): పాఠశాల గదులు ఊడ్చే స్వీపర్ల కష్టాలను చూసి వారికి ఉపయోగపడాలని ఉద్దేశ్యంతో రూపొందించిన ప్రాజెక్టు జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. వివరాల్లోకి వెళ్తే.. అందోలు మండలం కన్‌సాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఏ.స్రవంతి గైడ్ టీచర్ సిద్దేశ్ సహకారంతో 'డెస్క్ లిఫ్టర్' అనే ప్రాజెక్టును రూపొందించారు. రాష్ట్ర స్థాయిలో ఈ ప్రాజెక్టు గుర్తింపు పొంది జాతీయ స్థాయికి ఎంపిక కావడం విశేషం. డెస్క్ లిఫ్టర్‌ను ఎక్కడికైనా తీసుకెళ్లే లాగా, సులభంగా డెస్క్‌ల్ని మంచాల్ని కూడా లేపే విధంగా రూపొందించారు. స్కూళ్లలో గాని, ఆఫీసుల్లో గానీ హాస్పిటల్‌లో గాని హాస్టల్స్‌లో గాని చాలా చోట్ల బరువైన వాటిని శుభ్రం చేసేలా ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతోంది. ఈ ఎంపికపై ఎంఈఓ కృష్ణ, హెచ్‌ఎం ఇందిర విద్యార్థిని స్రవంతి, టీచర్ సిద్దేశ్వర్‌ను అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా మలేరియా అధికారి సుధాకర్


సర్వే వివరాలు తెలుసుకుంటున్న సుధాకర్

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి సుధాకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మామిడ్గి గ్రామంలో ఆయన పర్యటించారు. రెండు రోజుల కిందట గ్రామంలో డెంగీ వ్యాధి సోకిన విషయం తెలిసిందే. అందులో భాగంగా గ్రామంలో వైద్య సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మురికి కాల్వలు శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు.

టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఫైజల్

సంగారెడ్డి: టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఫైజల్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా శనివారం స్థానిక సంగారెడ్డి లోని ఐబీలో టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, సీనియర్ జర్నలిస్టులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తన మీద నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, అమర్‌కు ఫైజల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీనియర్ జర్నలిస్టులు ఖాలిక్ హుస్సేన్, మసూద్ ఖాన్, మహమ్మద్ ఆరిఫ్, శ్రీనివాస్, మురళీ, శేఖర్, మహమ్మద్ సిద్దిఖ్, ఎంఏ మతిన్, అన్వర్, షౌకత్, నరహరి, పవన్, సంతోష్, అక్మల్, షేక్ ఆరిఫ్, సాయి ఆమెర్, యూసుఫ్, పాల్గొన్నారు.


టాస్క్‌ల పేరుతో మోసం..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని గోకుల్ నగర్ కు చెందిన ఓ వ్యక్తికి జూన్ 14వ తేదీన టాస్క్‌లు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామంటూ మెసేజ్ వచ్చింది. బాధితుడు స్పందించి తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి పలు దఫాలుగా రూ.రూ.1.05 లక్షలు వేశాడు. అనంతరం బాధితుడు తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భద్రత లేని బతుకుబండి..!

ఆర్టీసీలో పనిభారం.. కార్మికుల కకావికలం!

సండే స్పెషల్



సాక్షి, సిద్దిపేట / సిద్దిపేట కమాన్: మెదక్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, నర్సాపూర్, నారాయణఖేడ్, జహీరాబాద్, రంగారెడ్డి రీజియన్ పరిధిలో బీహెచ్ఈఎల్, కరీంనగర్ రీజియన్ పరిధిలోని హుస్నాబాద్ డిపోలు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోకి రానున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 758 బస్సులుండగా అందులో ఆర్టీసీ బస్సులు 525, అద్దె బస్సులు 233 ఉన్నాయి. వీటికి కండక్టర్లు 1,506, డ్రైవర్లు 1,068 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

రోజుకు 400 నుంచి 420 కిలోమీటర్లు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకముందు విధులు నిర్వహించే సిబ్బంది ఆర్డీనరీ బస్సుల్లో ఒక రోజు 350 నుంచి 360 కిలో మీటర్లు డ్యూటీ చేస్తే తర్వాతి రోజు రెస్ట్ ఉండేది. కానీ ప్రస్తుతం రోజు 400 నుంచి 420 కిలో మీటర్లు డ్యూటీ చేస్తున్నారు. అదే విధంగా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో గతంలో ఒక రోజు 470 నుంచి 500 కిలో మీటర్లు డ్యూటీ చేస్తే, ప్రస్తుతం 520 నుంచి 550 కిలో మీటర్లు డ్యూటీ చేస్తున్నారు. విధి నిర్వహణలో రోజు 50 కిలో మీటర్లు అదనంగా డ్యూటీ చేస్తుండటంతో ఆర్టీసీ సిబ్బందిపై పని ఒత్తిడి భారం పెరుగుతోంది. దీంతో కార్మికులు అనారోగ్యాల పాలవుతున్నారు.

నిద్ర కరువై.. ప్రమాదాలకు కారణమై

మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ఒక కార్మికుడు 8 గంటల వరకు మాత్రమే డ్యూటీ చేయాలి. కానీ 10 నుంచి 14 గంటలు విధుల్లో ఉంటున్నారు. ట్రాఫిక్ కారణంగా అదనంగా డ్యూటీ చేయాల్సి వస్తోందని ఉద్యోగులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు డ్యూటీలతో నిద్ర కరువై ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. దీంతో డ్రైవర్లతోపాటు బస్సులో ఉండే ప్రయాణికులు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. యూనియన్ వ్యవస్థ లేకపోవడంతో డిపో మేనేజర్లు ఇష్టారాజ్యంగా సిబ్బందికి డ్యూటీలు వేస్తుండడంతో సిబ్బంది పని ఒత్తిడితో ఇబ్బందులకు గురవుతున్నారు.

సెలవు కావాలంటే డబుల్ డ్యూటీ

డ్రైవర్లు, కండక్టర్లకు సెలవులు మంజూరు చేయకుండా ఉన్నత అధికారులు పలు కొర్రీలు పెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మహిళా కండక్టర్లకు సైతం సెలవులు మంజూరు చేయడం లేదని తెలుస్తోంది. సెలవు అవసరమైతే డబుల్ డ్యూటీ చేయాలని నిబంధన పెడుతున్నట్లు కార్మికులు వాపోతున్నారు. అనుకోకుండా ఏదైనా కారణంతో విధులకు హాజరు కాకపోతే డిపో అధికారులు సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నారు. అనారోగ్యానికి సంబంధించి సిబ్బంది స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు సర్టిఫికెట్లు తీసుకొచ్చినా డిపో మేనేజర్లు ఆ పత్రాలు అంగీకరించమని, హైదరాబాద్ తార్నాక ఆర్టీసీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు సర్టిఫికెట్ తీసుకురావాలంటూ ఇబ్బంది పెడుతున్నారు.

కేఎంపీఎల్ రాకపోతే డ్రైవర్లకు కౌన్సెలింగ్

ఆర్టీసీ సిబ్బందికి తమకు విధించిన టార్గెట్లను చేరుకోకపోతే, అనుకున్న లక్ష్యం మేరకు డబ్బులు రాకపోతే డిపో అధికారులు కండక్టర్లను అడగడం, అదే విధంగా బస్సు తిరిగే రూట్‌లో కేఎంపీఎల్ రాకపోతే డ్రైవర్లను సంజాయిషీ అడుగడం చేస్తున్నారు. అదే విధంగా కేఎంపీఎల్ రాకపోతే డ్రైవర్లకు డిపో పరిధిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహిస్తున్నా ఆ రూట్‌లో ప్రయాణికులు ఎక్కే అవకాశం లేనప్పుడు టికెట్ చార్జీలు ఎలా వస్తాయని సిబ్బంది వాపోతున్నారు.

డిపో	ఆర్టీసీ	అద్దె	కండక్టర్లు	డ్రైవర్లు
మెదక్	44	55	180	71
నర్సాపూర్	22	03	48	36
సిద్దిపేట	47	53	180	95
గజ్వేల్	40	30	132	90
దుబ్బాక	30	08	62	50
సంగారెడ్డి	70	18	181	127
నారాయణఖేడ్	45	14	112	78
జహీరాబాద్	56	30	196	116
బీహెచ్ఈఎల్	138	0	320	340
హుస్నాబాద్	33	22	95	65

ఉచిత బస్సు ప్రయాణంతో..



కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో మహాలక్ష్మీ (మహిళలకు ఉచిత ప్రయాణం) పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళ ప్రయాణికుల సంఖ్య గతంతో పోల్చితే ప్రస్తుతం భారీగా పెరిగింది. మామూలుగా బస్సులో 60 నుంచి 70 మంది ప్రయాణికులు ఎక్కాల్సిన కెపాసిటీ ఉంటే ఈ ఉచిత ప్రయాణం పథకం ప్రవేశపెట్టిన తర్వాత బస్సులో సామర్థ్యానికి మించి 120 మంది వరకు ప్రయాణిస్తున్నారు. విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదం జరిగినా, రోడ్డు ప్రమాదంలో ఎవరైనా మృతి చెందినా డ్రైవర్లనే విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నారు. చిన్న చిన్న ప్రమాదాలు చోటు చేసుకుంటే విచారణ చేపట్టి మూడు నెలల ఇంక్రిమెంట్ కట్ చేయడం, ఇతర చర్యలు తీసుకుంటున్నారు.

లాభాల వెనుక కార్మికుల చెమట చుక్కలు..

ఒకప్పుడు ఆర్టీసీ యూనియన్లు సమ్మె నోటీసు ఇస్తే ప్రభుత్వాలు కూడా పునరాలోచనలో పడేవి. ఏదో రకంగా సమ్మెను విరమింపజేసేందుకు శతవిధాల ప్రయత్నాలు జరిగేవి. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులు సుదీర్ఘకాలంగా రెండు నెలల పాటు సమ్మె కొనసాగించడం .. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సమ్మెను చిన్నాభిన్నం చేశారు. సంఘాలను కూడా రద్దు చేశారు. అనంతరం ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన వీసీ సజ్జనార్.. సంస్థలో పలు సంస్కరణ చేపట్టారు. ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించేందుకు క్షేత్రస్థాయిలో అనేక చర్యలు చేపట్టారు. కార్మికులు కూడా తమ వంతు సహకరించారు. అయితే.. యూనియన్లు లేకపోవడం.. ఆర్ఎం, డీఎం స్థాయి అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. టార్గెట్‌ల పేరిట అందరూ కార్మికులపైనే పడటంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. 'మా బంధువులు చనిపోయారని ఎవరైనా లీవ్ అడిగితే.. శవంతో సెల్ఫీ దిగి పంపండి''అని హుకుం జారీ చేయడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది.

తగ్గిన 1.4 హెచ్‌ఆర్

ఆర్టీసీ సిబ్బందికి గతంలో 14.5 ఉన్న హెచ్‌ఆర్‌ఏలో 1.4 తగ్గించడంతో సిబ్బంది నష్టపోతున్నారు.ఆర్టీసీ సిబ్బందిపై అదనపు పని భారం పడడంతో మానసికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబాలతో సైతం సంతోషంగా గడపలేకపోతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిటైర్‌మెంట్ వయస్సు పెంచడంతో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పని ఒత్తిడిని తగ్గించి, హెచ్‌ఆర్‌ఏ పెంచాలని, రిటైర్‌మెంట్ వయస్సును తగ్గించాలని కార్మికులు కోరుతున్నారు.



తగ్గేదే లేదు

ఆందోళనపై ఆర్టీసీ డ్రైవర్ల ప్రకటన

మెదక్‌జోన్: తమ డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకు తగ్గేది లేదని, ఎన్ని రోజులైనా సమ్మె చేసేందుకు వెనుకాడబోమని ఆర్టీసీ డ్రైవర్లు స్పష్టం చేశారు. శనివారం మెదక్ డిపో ఎదుట రెండో రోజు కూడా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా విధులు నిర్వర్తించడంలో తమకు అభ్యంతరం లేదన్నారు. కొత్త షెడ్యూల్ ప్రకారం బస్సులు నడపమని కరాఖండిగా చెప్పారు. గతంలో రెండు రోజుల్లో 540 కిలోమీటర్లు బస్సును నడిపితే ఆ మరుసటి రోజున స్పెషల్ ఆఫ్ (సెలవు) ఇచ్చేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం 720 కిలో మీటర్ల మేర బస్సును నడిపినా ఆ మరుసటి రోజున స్పెషల్ ఆఫ్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ యాక్టు ప్రకారం రోజుకు 8 గంటలు మాత్రమే విధులు నిర్వర్తించాల్సి ఉండగా.. ప్రస్తుతం 12 గంటలపైగా విధుల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. ఉదయం 6 గంటలకు విధుల్లో చేరితే రాత్రి 6 గంటల వరకు పనిచేయాల్సి వస్తోందని వాపోయారు. మెదక్ నుంచి జేబీఎస్‌కు వెళ్లేందుకు 2.10 గంటల సమయం ఇస్తున్నారని, ట్రాఫిక్ కారణంగా మెదక్ నుంచి జేబీఎస్‌కు వెళ్లాలంటే మూడు గంటల సమయం పడుతోందని డ్రైవర్లు వివరించారు. దీంతో పనిష్మెంట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

శవంతో సెల్ఫీ దిగాలట!

మెదక్ డిపోలో డీఎం సుధా, సీఐ వీరబాబులు నిబంధనలు తుంగలో తొక్కారని డ్రైవర్ ఆంజనేయులు ఆరోపించారు. లేబర్‌యాక్టు ప్రకారం రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేయాలని, కానీ రెండు నుంచి నాలుగు గంటలు అదనంగా పనిచేయాల్సి వస్తోంది. దీంతో ఓవర్‌టైం (ఓటీ) కట్టించేవారు. గతంలో మాదిరిగా స్పెషల్ ఆఫ్ ఇవ్వాలి. బంధువులు చనిపోయారు సెలవు ఇవ్వాలని కోరితే శవంతో సెల్ఫీ దిగి పంపాలి అంటూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రిటైర్మెంట్ తప్ప రిక్రూట్‌మెంట్ లేదు



ఆర్టీసీలో బస్సులు తగ్గాయి. ప్రయాణికులు ఎక్కువయ్యారు. డ్రైవర్ల కొరత ఉంది. పదేళ్ల నుంచి రిటైర్మెంట్ తప్ప రిక్రూట్‌మెంట్ లేదు. దీంతో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. పైగా నాటి కిలో మీటర్ల కంటే ప్రస్తుతం ఎక్కువ కిలో మీటర్లు తిప్పుతున్నారు. దీంతో పనిభారం పెరిగింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు తర్వాత ప్రయాణికుల రద్దీ ఎక్కువైంది. కానీ బస్సులు పెరగలేదు. పల్లెలకు బస్సులు తగ్గాయి. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌ల రిక్రూట్‌మెంట్ జరగాలి. టిమ్‌లతో డ్రైవర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పని గంటలు తగ్గించాలి. ప్రస్తుతం ఉన్న రిటైర్మెంట్ వయసు కూడా తగ్గించాలి. అధికారులు కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమన్వయంతో వ్యవహరించాలి.

– ఎస్.మల్లేశం, టీఎంయూ నేత

యూనియన్ వ్యవస్థ ఉండాలి



యూనియన్‌లు రద్దు చేయక ముందు సిబ్బందికి విధులు ఎలా ఉన్నాయో ప్రస్తుతం కూడా అలానే ఉండాలి. సిబ్బంది సమస్యల పరిష్కారంపై అధికారులకు రిప్రజెంటేషన్ ఇవ్వడానికి యూనియన్ వ్యవస్థ ఉంటే బాగుంటుంది. యూనియన్‌లు ప్రభుత్వానికి, సిబ్బందికి మధ్య వారధిగా పని చేస్తాయి. గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రభుత్వ విలీన ప్రక్రియ వెంటనే పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం ఇవ్వాలి.

– శేషు, ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ సెక్రటరీ

నేనెందుకు సమాచారం ఇవ్వాలి..?: ఆర్ఎం ప్రభులత



సాక్షి, సిద్దిపేట / మెదక్‌జోన్: కార్మికుల సమస్యలపై ఆర్టీసీ రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) ప్రభులతను సాక్షి సిద్దిపేట విలేకరి వివరణ కోరగా.. ''నేనెందుకు సమాచారం ఇవ్వాలి.. ఇవ్వను''అని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ ఫోన్ కట్ చేశారు. మరోసారి ప్రయత్నించినా స్పందించలేదు. సాయంత్రం మెదక్ విలేకరి ప్రయత్నించగా.. ముక్తసరిగా జవాబిచ్చారు. ఆర్టీసీ కార్మికులు కొత్త షెడ్యూల్ ప్రకారం బస్సులను నడపాల్సిందేనని ఆర్ఎం స్పష్టం చేశారు. మహాలక్ష్మి పథకం రాకముందు రెండు రోజుల్లో 540 కిలో మీటర్లు నడిపేవారు. మరుసటి రోజు స్పెషల్ ఆఫ్ ఉండేది. ప్రస్తుతం డీలక్స్, సూపర్ లగ్జరీలు, ఎక్స్‌ప్రెస్‌లను రోజుకు 360 కిలోమీటర్లు నడుపమంటున్నాం. స్పెషల్‌ఆఫ్‌ను తొలగించాం. ఏప్రిల్ నుంచి కొత్త షెడ్యూల్ అమల్లోకి వచ్చింది. మూడు నెలల తర్వాత ఇప్పుడెందుకు సమస్య వచ్చింది. వేసవిలోనూ ఇబ్బందులు లేకుండా డ్యూటీలు చేశారు. జీతాలు పెరిగాయి. డ్రైవర్ల కొరత ఉంది. ఆదాయం పెంచుకోవటంలో తప్పులేదు కదా..? అని చెప్పారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- సెంట్రింగ్ బాక్స్‌ల గ్యాంగ్ అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ బాలస్వామి


సెంట్రింగ్ బాక్స్‌లు పరిశీలిస్తున్న ఎస్పీ బాలస్వామి, పోలీసులు

కౌడిపల్లి(నర్సాపూర్): జల్సాలకు అలవాటు పడి సెంట్రింగ్ బాక్స్‌లు చోరీకి పాల్పడుతున్న గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డితో కలిసి చోరీ వివరాలను ఎస్పీ బాలస్వామి వెల్లడించారు. కొల్చారం గ్రామానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ పెద్దాపురం అశోక్ కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లిలో గ్రామానికి చెందిన దశరథ ఇంటి నిర్మాణం పనులు చేస్తున్నాడు. ఈనెల 11న పనులు ముగించుకొని మరుసటి రోజు వచ్చేసరికి 200 సెంట్రింగ్ బాక్స్‌లు చోరీ అయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం తెల్లవారు జామున పోలీసులు పెట్రోలింగ్ చేస్తూ తనిఖీలు చేయడంతో నిందితులు ట్రాలీ ఆటోలో సెంట్రింగ్ బాక్స్‌లు తరలిస్తూ ప్యాసింజర్ ఆటో, మరోబైక్‌పై వెళ్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. ఇందులో సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివ్వంపేట గ్రామానికి చెందిన కొందరు యువకులు, కొల్చారం మండలం రంగంపేట గ్రామానికి చెందిన మరికొందరు, పాపన్నపేట మండలం నాగసాన్‌పల్లికి చెందిన ఒకరు, అల్లాదుర్గంకు చెందిన మరొకరు మొత్తం పదిమంది యువకులు ఉన్నారు. వీరితోపాటు బాక్స్‌లను కొనుగోలు చేసిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి ట్రాలీ, ప్యాసింజర్ ఆటో, బైక్, 250 సెంట్రింగ్ బాక్స్‌లు, రూ.99వేలు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.

కూతురిని చూసేందుకు వెళ్తుండగా..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ముత్యాలు (ఫైల్)

తూప్రాన్: కూతురిని చూసేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఇమాంపూర్ గ్రామ చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం తుపాకులపల్లి గ్రామానికి చెందిన ఎళం ముత్యాలు(50) శనివారం గజ్వేల్ మండలం చిగురుపల్లిలోని తన కూతురు సబితను చూసేందుకు టీవీఎస్ వాహనంపై బయలుదేరాడు. 44వ జాతీయ రహదారిపై ఇమాంపూర్ చౌరస్తా వద్దకు చేరుకోగానే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముత్యాలు అక్కడికక్కడే చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.


ఘటనా స్థలంలో శ్రీకాంత్ మృతదేహం

యువకుడు మృతి, సోదరికి గాయాలు

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లాకు బిక్కనూరు మండలం మల్లుపలి తండాకు చెందిన శ్రీకాంత్ (23), తన సోదరి మౌనికతో కలిసి బైక్‌పై రామాయంపేట నుంచి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. దామరచెరువు గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న జేసీబీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై శ్రీకాంత్ అక్కడే మృతి చెందగా, మౌనికకు తీవ్రగాయాలు అయ్యాయి. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ధరణి భూ సమస్యలు ఎక్కడికక్కడే : మాణిక్

సంగారెడ్డి టౌన్: ధరణి భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధరణిలో భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు గత ప్రభుత్వం పరిష్కారించలేదని, ఈ ప్రభుత్వమైనా చేస్తదేమో అని ఆశలతో రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. కలెక్టర్ పలు మార్లు ఆదేశించినా మండల స్థాయిలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, శ్రీకాంత్, అశోక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కుందేళ్ల వేటకు వెళ్లి..

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వట్‌పల్లి(అందోల్): కుందేళ్ల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం అందోలు మండల పరిధిలోని తాడ్మన్నూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింలు (54) శుక్రవారం రాత్రి కుందేళ్ల వేటకు వెళ్లగా దారి మధ్యలో విద్యుత్ తీగ కిందపడి ఉంది. తీగకు కరెంట్ ఉందనే విషయం గమనించకుండా వైరును తీసుకున్న క్రమంలో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతురాలి భార్య మాణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటిలో మునిగి యువకుడు..

మునిపల్లి(అందోల్): మునిపల్లి మండలంలో మక్త క్యాసారం గ్రామానికి చెందిన మద్దూర్ కుమార్(25) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఏరువాక పౌర్ణమి పునస్కరించుకొని పశువులను కడగడానికి గ్రామ సమీపంలోని సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వద్దకు వెళ్లాడు. పశువులను కడుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు బుదేరా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): అనుమానాస్పద స్థితిలో రైలు పట్టాలపై వ్యక్తి మృతి చెందిన ఘటన వడియారం శివారులోని రైలు పట్టాలపై చోటు చేసుంది. రైల్వే ఎస్ఐ తావునాయక్ కథనం మేరకు.. వడియారం -మాసాయిపేట రైల్వే స్టేషన్‌ల మధ్యలో పట్టాలపై వ్యక్తి మృతి చెందినట్లు స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించాం . మృతుడు ఆదిలాబాద్ జిల్లా మందమర్రి గ్రామానికి చెందిన మోరె భీమయ్య(33)గా గుర్తించినట్లు తెలిపారు. కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడా.. లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సదాశివపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. సుమారు 65 నుంచి 75 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి వారం రోజులుగా భిక్షాటన చేస్తూ రాత్రి సమయంలో గొల్లగూడెం శివారులోని ఓ హోటల్ వద్ద పడుకునేవాడు. శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని, మృతుడు 5.1 ఇంచుల పొడవు, నడుముకు కేవలం తెల్లని దోతీ మాత్రమే ఉందన్నారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే సదాశివపేట పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని, సువర్ణ లెట్ సిటీ వెంచర్ సూపర్ వైజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరేసుకొని ఆత్మహత్య

అల్లాదుర్గం(మెదక్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. ముస్లాపూర్ గ్రామానికి చెందిన తుర్పాటి దాదయ్య(40) భార్య గంగమ్మ గొడవపడి 15 రోజుల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన దాదయ్య ఇంట్లోనే దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని నందికంది గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ఖేరి జిల్లాలోని ధర్మపూర్ గ్రామానికి చెందిన హిమాంషు(21)నందికంది గ్రామ శివారులో గల బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమలో కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేస్తున్నాడు. ఫైల్స్ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తితో 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం నందికంది గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ఇద్దరు అదృశ్యం

అమీన్‌పూర్‌లో బాలిక

పటాన్‌చెరు: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలో నర్రెగూడెంకు చెందిన మైనర్(17) బాలిక తల్లిదండ్రులు ఇద్దరు కూలి పనికి వెళ్లగా, శుక్రవారం ఇంటి నుండి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు బాలిక కోసం తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికిన ఆచూకి లభించలేదు.మైనర్ బాలిక అదృశ్యంపై మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో చోట వ్యక్తి..

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రసాద్ అతడి భార్యతో కలిసి ఏడేళ్ల కిందట బతుకుదెరువు కోసం బీరంగూడ రాఘవేంద్ర కాలనీకి వచ్చాడు. వెల్డింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ప్రసాద్ మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రసాద్ తిరిగి రాలేదు. చుట్టుపక్కల తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య శనివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.